క్లుప్తంగా

అయ్యప్ప భక్తులకు అన్నదానం



నైవేద్యంతో ఉగ్రసేన దంపతులు

షాద్‌నగర్: పట్టణంలోని శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో శుక్రవారం పట్టణానికి చెందిన డాకన్నగారి ఉగ్రసేన దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గోలెపు చంద్రశేఖర్, బసప్ప, మంజు శ్రీ రాఘవేందర్, రేటికల్ నందీశ్వర్, లక్ష్మీనారాయణ, కోటిలింగం, జైహింద్‌రెడ్డి, భద్రప్ప, భవనం శ్యాం, రాఘవేందర్, అశోక్, మల్లేష్ యాదవ్, మల్చలం మురళి, అప్పి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని మద్దూరు సర్పంచ్ పి.నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మద్దూరు అనుబంధ గ్రామం రాంసింగ్‌తండాలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయ శిఖరం, విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేసి యజ్ఞహోమాలు నిర్వహించారు. ప్రతిష్ఠాపన విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేయించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, ఎంపీటీసీ వనిత, ఉపసర్పంచ్ గడ్డం శ్రీను, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపసర్పంచ్ రవినాయక్, నాయకులు సుధాకర్‌గౌడ్, రమేశ్, మోహన్, మలికార్జున్‌గౌడ్, పోచయ్య, మల్లేశ్, రమేశ్, మహేశ్ తదితరులున్నారు.

కేసులు ఎత్తివేత నిర్ణయం హర్షణీయం

తెలంగాణ ఉద్యమకారులు కేబుల్ రాజు, కుమ్మరి రమేశ్

మొయినాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేస్తామని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని కేబుల్ రాజు, కుమ్మరి రమేశ్ పేర్కొన్నారు. శుక్రవారం మొయినాబాద్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమ కారులపై కేసులు ఎత్తివేస్తామని ప్రకటించడం సంతోషకరమన్నారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, యువకులపై అనేక కేసులు నమోదయ్యాయని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను పట్టించుకోలేదన్నారు. రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ కేసులు ఎత్తివేయడంతో వేల మంది ఉద్యమకారులకు కేసుల నుంచి విముక్తి లభించనుందన్నారు. తెలంగాణలో ప్రజలకోసం పనిచేసే ప్రజాప్రభుత్వ పాలన రావడం శుభపరిణామని వారు పేర్కొన్నారు.

ప్రజా ప్రభుత్వం మొదలైంది

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య

మొయినాబాద్: తెలంగాణ ప్రజలు కలలు గన్న ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ఆధ్వర్యంలో మొదలైందని మండల అధ్యక్షుడు మాణయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించిందన్నారు. ఇంత కాలం ప్రజలు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక మదనపడ్డారన్నారు. తెలంగాణ ప్రజలకు ఇప్పుడు స్వేచ్ఛగా తమ సమ్యలు చెప్పుకునే అవకాశం వచ్చిందన్నారు. శుక్రవారం ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి వేల మంది వచ్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తమ సమస్యలు తెలియజేశారన్నారు. మొన్నటి వరకు ప్రగతి భవన్ వైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్రాలు వచ్చినట్లయ్యిందన్నారు. ప్రజల సమస్యలన్నీ ప్రభుత్వం పరిష్కరించి మంచి పాలన అందిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

స్వపరిపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

చేవెళ్ల: చేవెళ్ల మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎప్పుడూ పాఠశాలకు తోటి విద్యార్థులతో కలిసి వచ్చే స్నేహితులు ఉపాధ్యాయులుగా పాఠం చెప్పడంతో తోటి విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

వాడీవేడిగా చర్చ..

- సమస్యల ఏకరువు
- అభివృద్ధిని పట్టించుకోని అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు
- సర్వసభ్య సభకు హాజరైన ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: చేవెళ్ల ఎమ్మెల్యేగా ఈ సభలో హాజరై ప్రారంభ ఉపన్యాసమిచ్చారు. మూడోసారి తనను గెలిపించిన అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ నక్షత్రంజేవంతు అధ్యక్షతన మండల అభివృద్ధి అధికారి సంధ్య నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని మాట్లాడి వెళ్లిపోయారు. అనంతరం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధిక సంఖ్యలో పాల్గొని సర్వసభ్య సమావేశం ఎజెండాలోని ముఖ్య అంశాలైన విద్యుత్, తాగునీరు, రోడ్లు, శిశు సంక్షేమ అంశాలపై అధికారులను నిలదీశారు. గ్రామాల్లో విద్యుత్‌పై జరిగిన అభివృద్ధిని మండల అధికారి వివరించారు. సర్పంచ్‌లు గెలిచి ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా, ఎప్పటికప్పుడు అధికారులు మారుతున్నప్పటికీ పనులు మాత్రం ఎక్కడికక్కడే తిష్ట వేషాయని వారు సూచించారు. ప్రతీ మండల సర్వసభ్య సమావేశానికి ఒక కొత్త అధికారి రావడం తనకేమి తెలియదని చెప్పడం పరిపాటిగా మారిందని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. తమపదవి కాలం నెలన్నర ఉన్నదని ఇప్పటికైనా ముఖ్యమైన సమస్యలు పరిష్కరిస్తారా లేదా అని వారు సభదృష్టికి తెచ్చారు. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 14 సెంటర్లలో పోస్టులు ఖాళీగా ఉన్నాయని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముఖ్యంగా ఎత్‌మార్‌పల్లి ఆయా గ్రామాల్లో ఆయాలు, అంగన్‌వాడీ టీచర్లు లేకపోవడంతో ప్రభుత్వం ద్వారా వస్తున్న పౌష్టికాహారం గుడ్లు, పాలు సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. పేరుకే మిషన్ భగీరథ ఇంటింటికి నల్లా ఉన్నప్పటికీ ఏ నల్లాలో నీరు రావడం లేదని టోల్‌కట్ట, ఎన్కెపల్లి తదితర గ్రామాల సర్పంచ్‌లు చెప్పారు. అధికారులు మాత్రం మూడు నెలలకు ఒకసారి మండల కార్యాలయంలో కనిపించి అవి చేస్తున్నాం, ఇవి చేస్తున్నామని సమస్యలు రాసుకొని రికార్డులకే పరిమితమవుతున్నారన్నారు. కనీస సమస్యలు పరిష్కరించని ఈ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని సూచించారు. ఈ సందర్భంగా మండల ఎంపీపీ, జెడ్పీటీసీలు విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కోటిన్నర మంజూరు చేయించినప్పటికీ విద్యుత్ సమస్యలు ఎందుకు పరిష్కరించరన్నారు. అనంతరం మండల తహశీల్దార్ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో రేషన్ కార్డుల లబ్ధిదారులు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చునని సూచించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిందని ఈ ప్రభుత్వం తమకు ఎలాంటి సూచనలు ఇచ్చిన మార్పులు, చేర్పులు చేస్తామని వాటి ప్రకారం పనులు నిర్వహిస్తూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రమాణ స్వీకారం అనంతరం అర్హులైన వారికి పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ సర్వసభ్య సమావేశంలో విద్యుత్, తాగునీరు, రోడ్లు, అంగన్‌వాడీ అధికారులపై వాడివేడిగా చర్చ జరిగింది. అనంతరం ఎంపీపీ నక్షత్రంజేవంతు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆమె సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో గ్రామాల్లో పర్యటించి సమస్యలు రాకుండా చూడాలన్నారు. జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, వైస్ ఎంపీపీ మమత, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా ఉపాధ్యక్షురాలు మంజులరవియాదవ్, సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు శోభావెంకట్‌రెడ్డి, చందన, శ్రీనివాస్‌ముదిరాజ్, అంబాజీరావు, నవనీతరాజు, విద్యాధికారి వెంకటయ్య, డీఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కాలె యాదయ్యకు శుభాకాంక్షల వెల్లువ

చేవెళ్ల: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా మూడో సారి విజయం సాధించిన హ్యాట్రిక్ ఎమ్మెల్యే కాలె యాదయ్యకు పార్టీ నాయకులు, వ్యాపారులు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లిన వారు శాలువా కప్పి, పూల మాలవేసి సన్మానించారు. చేవెళ్ల ప్రజలు అభివృద్ధి చేసే నాయకున్ని గుర్తించి ఎన్నుకున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎస్ ఆంజనేయులు, యు, రాంప్రసాద్, రాఘవేందర్, ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

షాబాద్: చేవెళ్ల ఎమ్మెల్యేగా గెలుపొందిన కాలె యాదయ్యకు కొమరబండ సర్పంచ్ ఏశాల చంద్రశేకర్, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. నవాబుపేట్ మండలం చించల్‌పేట్ గ్రామంలో ఎమ్మెల్యే నివసంలో కలిసి శుక్రవారం మాజీ సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తను అండగా ఉంటానని చెప్పారు.

మొయినాబాద్‌రూరల్‌లో..

మొయినాబాద్‌రూరల్: తనను గెలిపించిన నాయకులకు ఎమ్మెల్యే కాలె యాదయ్య అభినందనలు తెలిపారు. మండల కార్యాలయం ఆవరణలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను వివిధ గ్రామాల నాయకులు ఘనంగా సన్మానించారు.



మొయినాబాద్‌రూరల్: ఎమ్మెల్యే కాలె యాదయ్యను సన్మానిస్తున్న సూరియాదవ్



కాలె యాదయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, వ్యాపారులు

అందరి ఆధారాభిమానాలే తన గెలుపునకు కారణమన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాహుఫ్, గొల్ల సూరియాదవ్, మైబాయ్, అంజిరెడ్డి, జేవంతు, సురేందర్‌గౌడ్, రాజు, యాదగిరియాదవ్, భాస్కర్‌చారి, పరమేష్, కృష్ణ పాల్గొన్నారు.

పీసరి సత్తిరెడ్డి మృతదేహానికి నివాళి

షాబాద్: షాబాద్ మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామానికి చెందిన పీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి తండ్రి పీసరి సత్తిరెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్, మద్దూరు సర్పంచ్ నరేందర్‌రెడ్డిలు పీసరి సత్తిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులను వారు పరామర్శించారు. పీసీసీ రాష్ట్ర కార్యదర్శి రాంరెడ్డి, నరేందర్ రెడ్డి, ఉదయ్‌మోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నిర్మాణానికి నోచుకోని టేకులపల్లి వంతెన

- భయం..భయంగా ప్రయాణం
- ఎప్పుడు ఏమవుతుందోనని స్థానికుల ఆందోళన
- పట్టించుకోని అధికారులు

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వాన్నంగా మారాయి. ఈ రోడ్లపై వాహనాలు వెళ్లాలంటేనే భయం..భయంగా వెళ్లిల్సిన దుస్థితి నెలకొంది. ఇంతకాలం అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎలాగు పట్టించుకోలేదు. కనీసం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఈ రోడ్లను పట్టించుకుంటుందేమోనని స్థానికులు, వాహనదారులు చెబుతున్నారు. రోడ్లు, వంతెనల నిర్మాణం కోసం కాంగ్రెస్ నాయకులు ఇదివరకు పలుమార్లు పాదయాత్రలు, దర్నాలు, నిరసనలు వ్యక్తం చేశారని వారు గుర్తుచేస్తున్నారు. కొందుర్గు రోడ్ల పరిస్థితిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అవగాహన ఉందని పలువురు చెబుతున్నారు. ఆయన హయాంలోనైనా తమ గ్రామాల్లోని రోడ్లు బాగుపడుతాయని కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు. కొందుర్గు మండలంలోని టేకులపల్లి వంతెన వర్షాకాలంలో పూర్తిగా శిథిలమై వాహనాల రాకపోకలకు ఆటంకిగా మారింది. అటు చూస్తే నుయ్యి.. ఇటు చూస్తే గొయ్యి..అనే చందంగా ఇక్కడి పరిస్థితి ఉంది. రాత్రి వేళల్లో ఎవరైనా గుర్తు తెలియని వారు ఈ రోడ్డుపై వెళితే ప్రాణాలకే ప్రమాదం. ఇప్పటికైనా ఈ కొత్త ప్రభుత్వంలో వంతెన బాగుచేయాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.



ప్రజాదర్బార్‌కు చేవెళ్ల నుంచి ఫిర్యాదు

చేవెళ్ల: తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జ్యోతిరావుఫూలే ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌కు చేవెళ్ల మండలం నుంచి ఓ వికలాంగుడు ఫిర్యాదు చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం ప్రారంభించిన ప్రజాదర్బార్‌కు చేవెళ్ల మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన గండు రవీందర్ తనకు వికలాంగ ఫించన్ రావడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడని చెప్పాడు. ఈ ప్రజాదర్బార్‌లో తన సమస్యను మంత్రి సీతక్కకు నేరుగా చెప్పుకొని వినతి పత్రం అందించినట్లు ఆయన తెలిపాడు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన మొదట్లో తనకు వచ్చే వికలాంగ ఫించన్‌ను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై అప్పటి నుంచి నేటి వరకూ ఫిర్యాదు చేసినా తనకు ఫించన్ మంజూరు కావడం లేదని చెప్పాడు. కొత్త ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెట్టిన మొట్ట మొదటి ప్రజాదర్బార్‌లో తన సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకంతో వచినట్లు ఆయన చెప్పాడు. ఇక్కడ ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారికి అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వారు తెలిపారు.



మంత్రి సీతక్కకు ఫిర్యాదు అందజేస్తున్న మల్కాపూర్ గ్రామానికి చెందిన గండు రవీందర్

షాద్‌నగర్ ఎమ్మెల్యేకు ఘన సన్మానం



ఎమ్మెల్యే శంకర్‌తో కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ మెజార్టీతో విజయం సాధించి ఎమ్మెల్యేగా ఎన్నికైన వీర్లపల్లి శంకర్‌ను శుక్రవారం నాయకులు ఘనంగా సన్మానించారు. మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకలు వెళ్లి పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎండీ మున్వర్, ఎండీ అన్వర్, ఎండీ అంజద్, సంతోశ్ నాయక్ తదితరులున్నారు.

నూతన ఎమ్మెల్యేకు అపూర్వ స్వాగతం

కొందుర్గు: షాద్‌నగర్ శాసన సభ్యుడిగా ఎన్నికైన వీర్లపల్లి శంకర్ శుక్రవారం మండల కేంద్రంలో ఓ వివాహానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. ఆయనకు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తుల కృషి మరువలేనిది

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



వీర్లపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: తనను గెలిపించేందుకు గ్రామస్తులు చేసిన కృషి మరువలేనిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం మొదటిసారిగా తన గ్రామానికి శుక్రవారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి ఎమ్మెల్యేగా గెలిచి రావడం పట్ల గ్రామస్తులు సంబరాలు చేసుకున్నారు. ఆయనను కలిసేందుకు గ్రామస్తులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకుంటానన్నారు. అనంతరం వెంకమ్మగూడ, మామిడిపల్లి గ్రామాలను సందర్శించారు. సర్పంచ్ రాములమ్మ, అప్పారెడ్డిగూడ ఉప సర్పంచ్ సీతారాం, నవాజ్ రెడ్డి, అన్వర్, చంద్రశేఖర్, పాల్గొన్నారు.